www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 జూలై 2023

5

ఏలూరు



విద్యార్థులతో లక్ష్యంతో చదవాలి : డిఇఒ

చింతలపూడి :విద్యార్థులు కష్టపడితేనే ఫలితం ఉంటుందని, లక్ష్యంతో ముందుకుసాగాలని అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్‌సుందరం అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల అసెంబ్లీకి హాజరై విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాడు - నేడు' ద్వారా సిఎం జగన్ పాఠశాలలను అత్యున్నత ప్రమాణాలతో, అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించారన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా వసతి, విద్యా కానుక వంటి అనేక పథకాలను సిఎం అందిస్తున్నారన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పూరేటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడుగడుగూ.. గుంతల మడుగు..!

చెరువులను తలపిస్తూ రోడ్లపై గోతుల్లో వర్షపు నీరు

ఏజెన్సీ, డెల్టాలోనూ అత్యంత దారుణంగా రహదారి వ్యవస్థ

జంగారెడ్డిగూడెం - బుట్టాయగూడెం రోడ్డు అధ్వానం

ఏలూరు - కైకలూరు రోడ్డు చూస్తేనే హడల్

నవుడూరు - పాలమూరు రోడ్డు గతుకులమయం



చెరువులను తలపిస్తున్న బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రోడ్డు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్‌అండ్‌బి రహదారుల వ్యవస్థ దారుణంగా మారింది. వర్షాలకు రోడ్లపై గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో జనం రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నరకం అనుభవిస్తున్నారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఏజెన్సీ, డెల్టా అనే తేడా లేకుండా రోడ్ల వ్యవస్థ అత్యంత దారుణంగా తయారైంది. వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లయినా రోడ్ల గురించి పట్టించుకోని దుస్థితి ఉంది. దీంతో రోడ్లు మరింతగా దెబ్బతినడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,200 కిలోమీటర్ల వరకూ ఆర్‌అండ్‌బి రోడ్ల వ్యవస్థ ఉంది. గత టిడిపి ప్రభుత్వం జిల్లాలోని రోడ్ల గురించి పట్టించుకోలేదు. దీంతో 2019 ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం వైసిపి అధ్వాన రోడ్లపై అప్పటి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు వేస్తామని చెప్పింది. గోతులమయంగా మారిన రోడ్ల గురించి ప్రతిపక్ష పార్టీ హోదాలో ప్రస్తుత ఎంఎల్‌ఎలుగా ఉన్న నాయకులంతా పాదయాత్రలు, ఆందోళనలు చేశారు. తీరా అధికారంలోకొచ్చాక వైసిపి ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో రోడ్ల వ్యవస్థ మరింత అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు చూస్తే భయంగొలిపే పరిస్థితి ఉంది. జంగారెడ్డిగూడెం-బుట్టాయగూడెం ప్రధాన రహదారి పెద్దపెద్ద గోతులతో దారుణంగా తయారైంది. వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. బుట్టాయగూడెం-దొరమామిడి, దొరమామిడి- పందిరిమామిడిగూడెం, కన్నాపురం-పులిరామన్నగూడెం రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్ల వెంట రాకపోకలు సాగించాలంటే జనం నిత్యం నరకం అనుభవిస్తున్నారు. మండల కేంద్రం కుక్కునూరు నుంచి లంకాలపల్లి వరకూ ఉన్న ప్రధాన రహదారి చూస్తే వణుకు పుట్టాల్సిందే. ఆ రోడ్డు గుండా వాహనాలపై చాలా జాగ్రత్తగా వెళ్లాల్సి ఉంటుంది. అదుపు తప్పితే ప్రమాదాలకు గురికావాల్సిందే. జీలుగుమిల్లి మండలంలోనూ పలు గ్రామాల రోడ్ల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణమంటేనే గుండె గుబిల్లుమంటోంది. రెండు రోజుల క్రితం రోడ్డు దుస్థితి నిరసనగా ఒక యువకుడు రోడ్డుపై మంచం వేసి పడుకున్న సంగతి తెలిసిందే. డెల్టాలోని పలు మండలాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పెనుమంట్ర మండలం పోలమూరు-నవుడూరు మధ్య రోడ్డు గతుకులమయంగా మారినా స్పందించిన దాఖలాల్లేవు. మొన్నటి వరకూ జెడ్‌పి ఛైర్మన్, ప్రస్తుతం ఎంఎల్‌సిగా ఉన్న కవురు శ్రీనివాస్ స్వగ్రామం పాలమూరు, ప్రస్తుత నివాసం ఉంటున్న నవుడూరు గ్రామాల మధ్య రోడ్డుకే దిక్కు లేకుండాపోయిందని అక్కడి ప్రజలు ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్నారు. నెలమూరు-మడుగుపోలవరం, పెనుమంట్ర-జుత్తిగ, పొలమూరు-బ్రాహ్మణచెర్వు రోడ్లు సైతం ఇదేవిధంగా తయారయ్యాయి. ఇరగవరం మండలంలో కంతేరు నుంచి పెనుగొండ వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. పెనుగొండ మండలంలో చేడ గ్రామానికి వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. ఇలా ఒకటి కాదు, రెండు కాదు పెద్దసంఖ్యలో ఆర్‌అండ్‌బి రోడ్ల వ్యవస్థ దెబ్బతింది. ఒకటే ఆరా రోడ్లు వేస్తున్నా అత్యధిక రోడ్లు గోతులమయంగానే ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ తీరుపై జనంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



ముంపులోనే ఉన్న దాచారం గుండేటి వాగు కాజ్‌వే

వీడని ముంపు..!

గోదావరి తగ్గుముఖం పట్టినా ముంపులోనే రహదారులు

ఆరు రోజులుగా 16 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఐదు రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ వస్తున్న గోదావరి వరద ఉధృతి తగ్గినా మండలంలోని రహదారులను మాత్రం ముంపు సమస్య వీడలేదు. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం సోమవారం 38 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అయితే మండలంలోని కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేపై ఇంకా వరద నీరు తగ్గలేదు. దీంతో ఆరు రోజులుగా 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాగు అవతల వైపు ఉన్న గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు, కుక్కునూరు హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు, రైతులు, వ్యాపారులు మండల కేంద్రానికి రావాలంటే 15 కిలోమీటర్లు చుట్టుతిరిగి రావాల్సి వస్తోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లంక గ్రామాలను వీడని భయం

యలమంచిలి: ఎగువ ప్రాంతం నుండి భారీగా చేరుతున్న వరద నీటితో మండలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన కనకాయలంక, బాడవ, పెదలంక, యలమంచిలి లంక, గంగడపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి తదితర గ్రామాల్లోని ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. భద్రాచలం వద్ద వరద నీటిమట్టం ఒకరోజు తగ్గడం, మరుసటి రోజు పెరగడం వంటి పరిణామాలతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వరద నీటిని దిగువకు నిరంతరాయంగా వదులుతున్నారు. దీంతో లంక గ్రామాల ప్రజల్లో ఆలజడి నెలకొంది. ముఖ్యంగా కనకాయలంకలోని ప్రజలు ఏ అవసరం ఉన్నా పడవ దాటి చాకలిపాలెం, మానేపల్లి, జగన్నపేట, రాజోలు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో వారి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ప్రభుత్వం నుండి కనీసం వాటర్ ప్యాకెట్లు, చిన్న పిల్లలకు పాలు వంటివి కూడా అందించడం లేదని ఆ గ్రామాలలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి పాయ దాటడానికి కేవలం ఒకే ఒక ఇంజన్ పడవలను కేటాయించారని, అవి ఏమాత్రం ఇక్కడి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల సౌకర్యార్థం పడవలను పెంచి అక్కడ ప్రజలందరికి తాగునీరు, నిత్యావసరాలు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మణిపూర్ దారుణాలపై నిరసనల వెల్లువ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన అరాచకవాదుల చర్యలు నిరసిస్తూ సోమవారం స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమానికి ఒవి.ధనుంజయరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌ఎన్.రమేష్ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలను ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలన్నారు. మణిపూర్‌లోని సహజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ అల్లర్లను ప్రోత్సహించి జాతుల ఘర్షణగా చిత్రీకరించడానికి ప్రయత్నించిందని విమర్శించారు. ఇటువంటి ఘటనలు వందల కొద్దీ జరిగాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటని, చేతగానితమని అన్నారు. జెవివి నాయకురాలు దుర్గాంబ మాట్లాడుతూ ఈ దేశంలో స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవి.సుధాకర్ మాట్లాడుతూ ప్రధాని మోడీ 78 రోజుల వరకు ఈ సంఘటనపై నోరు మెదపలేదని, ఈ వీడియో కనుక బయటికి రాకుండా ఉండుంటే ఏమాత్రం స్పందించేవారు కాదని విమర్శించారు. కార్యక్రమంలో బోడెం శ్రీనివాస్, మోహన్‌రావు, దేవేంద్ర, కృష్ణారావు, సుభాషిణి, రామాంజనేయులు, నారాయణరావు, గంగాధర్‌రావు, సాయిరమేష్, కాకర్ల రాజేంద్రప్రసాద్, సుందరయ్య, మావూరి శ్రీనివాస్, దొర, విజయలక్ష్మి, పద్మావతి, రామ్మోహన్ పాల్గొన్నారు.

చింతలపూడి: మణిపూర్ ఘటనలకు బాధ్యత వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజీనామాలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ, ఐద్వా జిల్లా నేత ఎం.లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. పట్టణంలో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో ప్రదర్శన, నిరసన చేపట్టారు. తొలుత ప్రజాసంఘాల కార్యాలయం నుండి బోస్ బొమ్మ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించి అనంతరం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎం.బాలరాజు, కె.అనురాధ, ఎస్‌డి.జప్రుల్లా, డి.సత్తిబాబు, పి.పాండురంగారావు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసిస్తూ, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో చింతలపూడి పోలీసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కె.ఆజాద్ మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు హేయమైన చర్యని అన్నారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు ఎస్‌కె.అమీర్‌పాషా, జిన్నా, కిషోర్, అజయ్, ముత్తేశ్వరరావు, రజిని, కృపావరం, లక్ష్మణ్, ప్రతాప్, సురేష్, సంజయ్, అశోక్ వర్ధన్, దాసు పాల్గొన్నారు.



ఏలూరులో..

ముసునూరు: మణిపూర్ ఘటనలు అత్యంత బాధాకరమని సిపిఐ (ఎంఎల్) మండల కార్యదర్శి వేమల బక్కయ్య అన్నారు. సోమవారం రమణక్కపేటలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నందిపాము చిట్టిమ్మ, దారా బేబిషాలిని, గంటాంటి లహరిక, ఆముదాల పుష్పలత, ఉయ్యూరు విజయలక్ష్మి, ఆముదాల పార్వతి పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: మణిపూర్ ఘటనలకు కారకులపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ ఫాదర్ పి.జీవన్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ అతిథిగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ అధ్యక్షులు పేరికె వరప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలక ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, రాష్ట్ర దళిత జెఎసి కన్వీనర్ పొలిమేర హరికృష్ణ, ఎస్‌సి, ఎస్‌టి సెల్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు అబ్రహం మాట్లాడారు. అనంతరం శాంతి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాస్టర్లు రత్న ప్రసాద్, ఎన్‌ఎల్.పాల్, సభ్యులు పాల్గొన్నారు.



చింతలపూడిలో..

జిల్లాలో విస్తారంగా వర్షం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో సోమవారం తెల్లవారుజామునుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. రహదారులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల రహదారులు ఛిద్రంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లోకి నీరుచేరి చెరువులను తలపిస్తున్నాయి. రుతుపవనాల ప్రభావంతో మరోరెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సార్వా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

పోలవరం : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం కురిసిన భారీ వర్షానికి మండలంలో పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గుంజవరం , తానాలకుంట, జిల్లేళ్లగూడెం, కొవ్వాడ కాలువలు కల్వర్టుల ద్వారా వర్షపు నీరు ధృతంగా ప్రవహిస్తుంది. పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిస్ నుండి కాలువ జలాలు గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. కొత్త నూతన గూడెంలో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా జలమయం కావడంతో రాకపోకలకు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కడమ్మ స్లూయిజ్ ద్వారా కొండ వాగుల జలాలు దిగుకు వెళ్లే మార్గం లేక 20 ఎకరాల నర్సరీ నీట మునిగినట్లు వ్యవసాయ అధికారి రాంబాబు తెలిపారు.

మండవల్లి : మండలంలో విస్తారంగా వర్షం కురిసింది. భైరవపట్నం, చావలపాడు మహిళా మండలి పులపర్రు, పుట్లచెరువు, కానుకొల్లు, హరిజనవాడ, కొత్త కాలనీ, తదితర ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి. మండవల్లి హరిజనవాడ, వెలమపేట, కైకలూరు సందు, బీసీ కాలనీ, మంచాలు తయారు చేసే కాలనీ, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి, రైల్వే గేటు రహదారులన్నీ నీటమునిగాయి.

ముదినేపల్లి : మండలంలో కురిసిన భారీ వర్షాలకు పలు లోతట్టు గ్రామాలు జలమయమయ్యాయి. గాలి, వానతో పాటు ఉరుములతో కూడిన వాన పడింది. ముదినేపల్లిలోని రోడ్లపై నీరు పారుదల లేక నిలిచిపోవడంతో ప్రజలు, ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. సింగరాయపాలెం - బంటుమిల్లి రోడ్డులో చెట్లు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఎల్ఐసి ఏజెంట్ల హక్కులను హరిస్తున్న బిజెపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆలిండియా ఎల్ఐసి ఎఒఐ సెంట్రల్ కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు బ్రాంచి-1 ఎల్ఐసి ఆఫీస్ వద్ద ఎఒఐ ఏలూరు బ్రాంచి ఆధ్వర్యంలో పోస్టర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు పి.శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏజెంట్ల హక్కులను కాలరాయాలని చూస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఐఆర్‌డిఎపై ఒత్తిడి తీసుకొచ్చి ఏజెంట్ల వ్యవస్థను తొలగించాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలు కడుతున్న పాలసీలపై జిఎస్‌టి విధించి, పాలసీదారులను ఇబ్బంది పెడుతున్నారని, భవిష్యత్తులో అన్నిసమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ప్రధాన కార్యదర్శి జెఎస్‌ఆర్ చంద్రశేఖర్, కోశాధికారి కనకారావు, జోనల్ కౌన్సిల్ సభ్యులు బి.రామ్మోహన్‌రావు, గోదావరి జగన్మోహన్‌రావు, ఇసి సభ్యులు సిహెచ్.జనార్ధన్‌రావు, శ్రీనివాసరావు. ఎమ్‌డి.షరీఫ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

భోజనం నాణ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతాలోపం లేకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సాంఘీక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ అన్నారు. చింతలపూడిలోని అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల మెనూలో లోపం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కోరారు.

భూస్వాముల దౌర్జన్యాలు దారుణం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మర్లగూడెంలో గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టిఆర్ భూములను రెవెన్యూ, పోలీసు అధికారుల అండతో భూస్వాములు దౌర్జన్యంగా దున్నివేయడాన్ని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ మర్లగూడెంలో గిరిజనులు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 18 ఎకరాల ఎల్‌టిఆర్ భూములను గిరిజనేతరుల మధ్య కొనుగోలు, అమ్మకాలు జరిగాయని, ఈ భూమిపై రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి గిరిజనులకే చెందుతాయని చెప్పారని వివరించారు. కానీ ప్రస్తుత రెవెన్యూ అధికారులు చట్టవిరుద్ధంగా గిరిజనేతరులకు పోలీసుల రక్షణ కల్పిస్తూ గిరిజనులు వేసిన వరి నారును దౌర్జన్యంగా దున్నివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గిరిజనేతరులకు అనుకూలంగా రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీవాసులకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు సుందరయ్య కాలనీ నివాసితులకు ఇళ్ల పట్టాలివ్వాలని కోరుతూ తహశీల్దార్‌కు సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ వినతిపత్రం అందజేశారు. సోమవారం ఉదయం గ్రీవెన్స్ డే సందర్భంగా తహశీల్దార్‌ను కిషోర్ కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ పూర్వపు వెంకటాపురం పంచాయతీ, ప్రస్తుత ఏలూరు మున్సిపాలిటీలో 19 డివిజన్ పరిధిలోని సుందరయ్య కాలనీలో 200 కుటుంబాలుపైగా నివసిస్తున్నాయన్నారు. 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఇక్కడ కాలనీవాసులకు ఇంటి పట్టా ఇవ్వలేదన్నారు. పేద ప్రజలు ఏదైనా ఇంటి మీద రుణాలు తెచ్చుకోవాలంటే పట్టాలు అవసరమని, తహశీల్దార్ పరిశీలించి, సుందరయ్య కాలనీవాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తహశీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల విషయంపై ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సుందరయ్య కాలనీవాసులు కె.రాజేష్ , ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్థికసంఘం నిధులివ్వాలని సర్పంచుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఎం జగన్ దారిమళ్లించిన ఆర్థికసంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయాలని కోరుతూ ఏలూరులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచుల సంఘం పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్షంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ ఛాంబర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కడలి గోపాలరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సిఎం జగన్ సర్పంచులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు జగన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీలను అధ్వానంగా తయారు చేశారని, పారిశుధ్యం పడకేసిందన్నారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేయడమే కాకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8660 కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి సర్పంచులకు నిధులు, అధికారాలు, విధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షులు పిల్లి సత్తిరాజు, సర్పంచుల సంఘం అధ్యక్షులు పాలడుగు లక్ష్మణరావు పాల్గొన్నారు.



అధికారులకు వినతిని అందిస్తున్న సర్పంచులు, నాయకులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నుంచి చేబ్రోలు, ఉంగుటూరు, నారాయణపురం, సీతారాంపురం గ్రామాలకు చెందిన మహిళా సర్పంచులు రాంథే లక్ష్మీసునీత, బండారు సింధు, దిడ్ల అలకనంద, బళ్ల రాధ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం దక్కాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే లాగేసుకోవడం దుర్మార్గచర్య అని, సర్పంచులకు విలువ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు.

స్పందన అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

స్పందన అర్జీల పరిష్కారంలో ఫిర్యాదుదారుల సంతృప్తిస్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం - జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను జెసి బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎవిఎన్‌ఎస్.మూర్తి, జెడ్‌పిసిఇఒ రవికుమార్, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం 213 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపిగ్గా ఆలకించి వాటి పరిష్కారం నిమిత్తం సంబంధిత జిల్లా అధికారులతో నేరుగా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, విచారించి తదుపరి పరిష్కరించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో అర్జీలను పరిష్కరిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. స్పందన ద్వారా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో రీఓపెనింగ్ లేకుండా అధికారులు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాలు, రీ సర్వే, భూ వివాదాలు, పోలీసు, నవరత్నాలు, హౌసింగ్ పట్టాల పంపిణీ, తదితర అంశాలపై స్పందనలో అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు పట్టాలు మంజూరు చేయాలి : విమలక్క

ప్రజాశక్తి - ఏలూరు

టి.నరసాపురం, మద్రిగూడెం పరిధిలోని ఆరు గ్రామాల్లో సుమారు 90 ఎకరాల భూమిని 30 సంవత్సరాలుగా ఆతివాసీలు సాగు చేసుకుంటున్నప్పటికీ నేటికీ పట్టాలు మంజూరు చేయకపోవడం బాధాకరమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ ఛైర్‌పర్సన్ విమలక్క ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం ఎపి రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ అప్పట్లో కలెక్టర్ అప్పగించిన భూములను సర్వే చేయించాలన్నారు. ఆదివాసీల భూముల్లో వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. నీటి సదుపాయం గల భూములకు ఆయిల్‌పామ్ మొక్కలు ఇప్పించాలని, బండివారిగూడెంలో సర్వే నెంబరు 622 భూమిపై ఆచంట విజయలక్ష్మి అక్రమంగా తీసుకున్న బ్యాంకు రుణం సుమారు రూ.మూడు లక్షలు తీసుకున్నారని, దీనిపై భూమి వేలాన్ని ఆపాలని కోరారు. అలాగే బలస సత్యనారాయణ సంఘానికి ఇచ్చిన సర్వే నెంబరు 587/6లోని భూమి అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. భూ గరిష్ట పరిమితులతో చట్టం ద్వారా ప్రభుత్వభూమిని వెంటనే నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సింగోత్ నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.భాస్కర్, ఆర్‌సిసి నాయకులు రాజు, అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, ఎపి రైతు సంఘం నాయకులు కొండా రాము, బి.రమేష్, రాష్ట్ర నాయకులు కె.సతీష్, నాయకులు అంజిబాబు, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు స్పందన ఫిర్యాదులపై సమీక్ష

ఏలూరు:ఏలూరు, నూజివీడు డివిజన్ల పంచాయతీ కార్యదర్శులు, ఇఒపిఆర్‌డిలు, డిఎల్‌పిఒలతో ఈ నెల 25న స్పందన ఫిర్యాదుల పరిష్కారాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం పంచాయతీ రాజ్ శాఖ వరద సంబంధిత కార్యకలాపాల కారణంగా అక్కడ సిబ్బందిని మినహాయించబడిందన్నారు. ఏలూరు, నూజివీడు డివిజన్లలోని పంచాయతీ శాఖ సిబ్బందితో స్పందన పరిష్కారాలపై ఈ నెల 25న ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ హాలులో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సమయపాలన ఆధారంగా పిటీషన్లు పరిష్కరించడం, జిల్లాస్థాయి స్పందన పిటీషన్లను స్కేల్ డౌన్ చేయడం, రీఓపెన్ కేసులను నిర్ధారించడానికి, ఏవైనా కేసులను రీఓపెన్ చేస్తే ఎలా పరిష్కరించాలి, బియాండ్ ఎస్-ఎల్ఎ మించి లేకుండా పరిష్కరించడం, స్పందన రిజిష్టర్లను సరిగా నిర్వహించడం అంతర్గత ఎస్ఒపి, టైమ్ లైన్, రివ్యూ స్పందన ఆడిట్‌లను సిద్ధ చేయడం వంటి అంశాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి స్పందన పిటీషన్లు పెండింగ్, పరిష్కార సమాచారంతో హాజరు కావాలన్నారు. ఏలూరు, నూజివీడు డివిజన్ల పంచాయతీ కార్యదర్శులు, ఇఒపిఆర్‌డిలు, డిఎల్‌పిఒలు సమావేశానికి హాజరుకావాలన్నారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారిషా

జీలుగుమిల్లి: వర్షాకాలం ప్రారంభం కావడంతో పాటు, ఏకధాటిగా వర్షాలు కురుస్తుండటంతో ఏజెన్సీ వ్యాప్తంగా దోమల తీవ్రత ఎక్కువగా వుండి జ్వరాల బారిన పడే అవకాశం ఉన్నందున ముందుగానే దోమల మందు పిచికారి చేస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహాల్లో, ఎస్‌సి బాలుర వసతి గృహాల్లో, బాలికల వసతి గృహాల్లో, మడకంవారి గూడెం గిరిజన గురుకుల వసతి గృహంలో, వంకవారి గూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో అనంతరం బర్రింకలపాడు గిరిజన గురుకుల వసతి గృహంలో దోమల నివారణకు మలాథియాన్ మందును పిచికారి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, స్వరాజ్య లక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

కుటుంబానికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తాం : టిడిపి

బుట్టాయగూడెం: టిడిపి అధికారంలోకి రాగానే సంవత్సరానికి ప్రతి కుటుంబానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఆదేవిధంగా ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా వారందరికీ సంవత్సరానికి రూ.15వేలు ఇస్తామని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కెఆర్‌పురం గిరిజన కాలనీలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' టిడిపి మ్యానిఫెస్టోలోని పథకాలను సోమవారం ఇంటింటికి వెళ్లి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ 18 నుంచి 59 సంవత్సరాలున్న మహిళలు ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.1500, నిరుద్యోగ యువతీ యువకులకు నెలకు రూ.3వేలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, ఏలూరు జిల్లా అగ్రికల్చర్ సెక్రటరీ యంట్రప్రగడ శ్రీనివాస్, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, దేయ్యాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి 'స్పందన'లో వినతి

టి.నరసాపురం: మండలంలో అధ్వాన్నంగా ఉన్న రహదారులను వెంటనే అభివృద్ధి చేయాలని కొత్తగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త సయ్యద్ నసర్ పాషా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ జెవి సుబ్బారావు, ఎంపిడిఒ మంగాకుమారికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని టి.నరసాపురం, బంధంచర్ల, గండిగూడెం రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయని తెలిపారు. టి.నరసాపురం ప్రధాన కూడలి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సెంటర్లో బంధంచర్ల వెళ్లే ప్రధాన రోడ్డుకు ప్రయనేజీ లేక రోడ్డుపై మురుగునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. రోడ్లపై నీరు నిల్వ వుండడంతో ఈగలు, దోమలు చేరి విష జ్వరాలు ప్రబలే అవకాశం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల్లో డ్రయినేజీలు ఏర్పాటు చేసి విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

వీధి దీపాలు బాగు చేయించాలి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ప్రధాన రహదారులు, డివైడర్‌లోని వీధిలైట్లు వెలగక ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. సోమవారం పట్టణంలో వీధి దీపాలు బాగు చేయించాలని కోరుతూ సిఐటియు, డివైఎఫ్ఐ, పట్టణ పౌర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు పనస సూర్యారావు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడ్డ జంగారెడ్డిగూడెం పట్టణ ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రధాన రోడ్డ డివైడర్ మధ్యలో మొత్తం 60 లైట్లలో 40 లైట్లు పనిచేయట్లేదని తెలిపారు. తక్షణం వీధిలైట్లపై దృష్టి సారించి పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు, డివైఎఫ్ఐ టౌన్ సెక్రటరీ షేక్ మహబూబ్, సుభాని పాల్గొన్నారు.

పిఎం యోజన లబ్ధిదారులకు అవగాహన

టి.నరసాపురం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు అవార్డు ఎంపిక సర్వేపై అవగాహన కలిగి ఉండాలని పోలవరం నియోజకవర్గ హౌసింగ్ డిఇ బి.సువర్ణరాజు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సువర్ణరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 2015లో ప్రారంభించి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అవార్డు అందించే ప్రక్రియ చేపట్టిందన్నారు. ఆగస్టు 1 నుంచి జూలై నెలాఖరులోపు నిర్మించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహాలను అధికారులు సందర్శించాల్సి ఉంటుందన్నారు. మండలంలో పిఎమ్ యోజన పథకం ద్వారా 2148 ఇళ్లు మంజూరు కాగా 1553 నిర్మాణంలో ఉన్నాయని, 873 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇఇ ఎండి సుభాని, సిఎలీజిస్ దేవి, ఎఇ జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి కార్మికుడు మృతి

టి.నరసాపురం: విద్యుత్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక టి.నరసాపురం పంచాయతీలోని ఇందిరా కాలనీకి చెందిన దొంత నాగేశ్వరరావు(40) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి 18 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు పామాయిల్ తోటలో గెలలు కోస్తుండగా, ఇనుపరాడ్ అదుపు తప్పి విద్యుత్ వైర్లపై పడడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రజనీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాగేశ్వరరావు కుటుంబానికి రూ.20 లక్షల పరిహారమివ్వాలి

ఆయిల్‌పామ్ గెలలు నరుకుతుండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందిన దొంతా నాగేశ్వరరావు కుటుంబానికి రూ.20 లక్షల ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పామాయిల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తమ్మిన సత్యనారాయణ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంవత్సర కాలంలో పామాయిల్ గెలలు నరికే కార్మికులు పదిమంది కరెంట్ షాక్ గురై చనిపోయారన్నారు. పామాయిల్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి సేవిస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్టు

నూజివీడు రూరల్: పట్టణంలో సోమవారం నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సిఐ మూర్తి తెలిపారు. సిఐ మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం, ఉన్నతాధికారుల ఆదేశంతో గంజాయి సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు నలుగురిని హాజరు పరచామని తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న పలువురిపై కేసు

జీలుగుమిల్లి: అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్న భర్త, వారి కుటుంబ సభ్యులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ములగలంపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితకు పెళ్లై తొమ్మిది సంవత్సరాలు గడిచింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త, మామ, అత్త, ఇద్దరు ఆడపడుచులు, కలిసి అదనపు కట్నం తేవాలని ఆమెను మానసికంగా, శారీరకంగానూ కొట్టడం, తిట్టడం చేస్తూ హింసిస్తున్నారని వివాహిత ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఆస్తి ధ్వంసంపై ఫిర్యాదు


ఉంగుటూరు: వెల్లమిల్లి పంచాయతీ పరిధిలో మనం-మన పరిశుభ్రతలకి సంబంధించి స్వాగత బోర్డులు, చింతాయగూడెం కర్ర చెరువు వద్ద మండల పరిషత్ వారు ఏర్పాటు చేసిన స్వాగత బోర్డులను ఇతర పార్టీలకు చెందిన ఆకతాయిలు ధ్వంసం చేశారు. ప్రభుత్వ ఆస్తులను పాడుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి బాలాజీ, సర్పంచి కుమార్, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో ఎస్ఐ యం.కుటుంబరావు తమ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వసతుల్లేవ్ సారూ.. కొంచెం చూడరూ..!

సమస్యలకు నిలయంగా బాలికల గురుకుల పాఠశాల



పురుగులతో కూడిన అన్నం..



కుళ్లిపోయిన ఉల్లిపాయలు



చెత్తకుప్పలతో నిండిపోయిన పరిసరప్రాంతాలు..

ప్రజాశక్తి - చింతలపూడి

బియ్యంలో పురుగులు, పాడైపోయిన భోజనం, కుళ్లిపోతున్న ఉల్లిపాయలు, మెత్తబడి పాడైన బంగాళదుంపలు, మరుగుదొడ్లు లేక, భోజనశాల సరిపోక, వసతి భవనం, పాఠాశాల చుట్టు పక్కల చెత్తతో నిండిపోయి దోమలమయంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.. ఇది చింతలపూడి బాలికల గురుకుల పాఠాశాల విద్యార్థుల దయనీయ పరిస్థితి..

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠాశాలలో 490 మంది పైగా బాలికలు చదువుతున్నారు. సరైన వసతులు లేక విద్యార్థినులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు 10 ఉండగా 5 మరుగుదొడ్లులలో నీటి సౌకర్యం లేదని, భోజనశాల సరిపోక ఇబ్బందులు పడుతున్నామని గతంలో అనేక సార్లు విద్యార్థినులు చెప్పినా నేటికీ పట్టించుకునే నాథుడే లేడు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు పడుకునే చోట చెత్త పేరుకుపోవటంతో రాత్రి సమయంలో దోమలు, ఈగలు బెడద ఎక్కువై ఇబ్బందులు పడుతున్నామని అవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం సరిగ్గా ఒకటికి రెండు సార్లు కడగకపోవటంతో భోజనంలో కూడా పురుగులు దర్శనం ఇస్తున్నాయి. అదే భోజనం తిని తమ కుమర్తె వాంతులు చేసుకుంటున్నట్లు ఒక విద్యార్థిని తండ్రి అప్పారావు వెల్లడించారు. ఉల్లిపాయలు కుళ్లిపోతున్నాయని, బంగాళదుంపలు మెత్తబడి కుళ్లిపోవటానికి సిద్ధంగా ఉన్నాయని, మంచి భోజనం లేక పిల్లలు అనారోగ్య పాలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహరి ఎప్పుడు నిర్మిస్తారు ?

నాగిరెడ్డిగూడెం బాలికల పాఠాశాల చుట్టూ ప్రహారికి గతంలో అనేక మంది వచ్చి చూసి అంచనాలు వేశారు. కాని ప్రహారి ఎత్తు పెంచే చర్యలు చేపట్టలేదు. నాగిరెడ్డిగూడెంకి సంబంధించి సారా కోసం నిత్యం పెద్దలు నుంచి యువకులు వరకూ ఈ వసతిగృహం వైపే వెళ్లాల్సిన పరిస్థితి.. దీంతో బాలికలు అభద్రతా భావానికి గురై ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై అధికారులకు స్వయంగా బాలికలే చెప్పినా ఇప్పటి వరకూ పట్టించుకొనే పరిస్థితి లేదు. తమ బిడ్డలకు సరైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలని ఉన్నతాధికారులను తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

నాణ్యమైన భోజనం అదించండి

నాగరాజు, చింతలపూడి

భోజనం ఏ మాత్రం బాగోవటం లేదని, పురుగులు ఉంటున్నాయని, సరిగ్గా భోజనం తినలేకపోతున్నామని తమ బిడ్డలు వాపోతున్నారు. సరైనా భోజనం పెట్టించండి.

అధికారులు దృష్టిసారించాలి

రాంబాబు, చింతలపూడి

మధ్యాహ్నం భోజనం బాగోటం లేదని మా అమ్మాయి చెప్పింది. ప్రిన్సిపాల్‌ని అడిగితే చర్యలు కూడా తీసుకోలేదు. భోజనంలో పురుగులు ఉంటున్నాయని అందరికి తెలిసినా ఎవరూ పట్టించుకోవటం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

ఘనంగా సర్ అర్థర్ కాటన్ జయంతి

భీమడోలు: వివిధ గ్రామాలలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా గుండుగొలను జల వనరుల శాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు సత్యనారాయణతో పాటు సిబ్బంది బాబురావు కాటన్ విగ్రహానికి పూలమాలవేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు గోదావరి డెల్టాలను సస్యశ్యామలంగా మార్చిన కాటన్ ధన్యజీవియని అభివందించారు. ఇదే క్రమంలో సాగు, తాగునీటి సమస్యలను తీర్చడంతో పాటు జల రవాణాకు సైతం అవకాశం కల్పించిన కాటన్ గోదావరి జిల్లాల ప్రజలకు చిరస్మరణీయుడని పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటికి చర్యలు

ఏలూరు టౌన్: గోదావరి వరద కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తాగునీటికి ఎటువంటి కొరతా లేకుండా చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కునూరు మండలం దాచారం గ్రామంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాగునీటికి ఎటువంటి కొరతా లేదని, వరద ముంపు ప్రభావం ప్రారంభం కాగానే, వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము, కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామాల ముంపు ప్రాంతాలకు చెందిన ప్రజలను శుక్రవారం దాచారంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వరద పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. వెంటనే వారికి తాగునీరుకి ఎటువంటి కొరతా రాకుండా శుక్రవారమే 50 వేల వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు.

పంటకు మద్దతు ధర చట్టం చేయాలి

ఏలూరు టౌన్: రైతు, కౌలు రైతు పండించిన పంటకు మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, కౌలురైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్, దొంతా కృష్ణ మాట్లాడుతూ రైతు, కౌలు రైతు సాగుదారులకు రూ.10వేల సాయం అందించాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు సరైన వేతనాలు లేక వంట చేసే సమయంలో సరైన సౌకర్యాలు లేక, కొన్నిచోట్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కానీ వీరికి ప్రభుత్వం ఎటువంటి ప్రమాద భీమా కల్పించకపోవడం చాలా అన్యాయమన్నారు. సోమవారం చింతలపూడి జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల నందు వంట చేస్తున్న వంట కార్మికులు రమాదేవి, శాంత గంజి పడి తీవ్రగాయాలయ్యాయని వీరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వం ప్రమాద బీమా కల్పించాలని అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం వీరికి ప్రత్యేకమైన సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం హాస్పటల్లో చికిత్స పొందుతున్న మధ్యాహ్నం భోజనం పథకం కార్మికురాలు రమాదేవిని ఆయన పరామర్శించారు. ఈ విషయాన్ని స్థానిక మండల విద్యాశాఖ అధికారికి సమాచారం అందించారు. పరామర్శించిన వారిలో ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు తుర్లపాటి బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, పకీరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

విఒఎలకు కనీస వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - నిడమర్రు

డ్వాక్రా యానిమేటర్స్ సిఎలను ప్రభుత్వం కొత్త రకమైన యాప్స్ పెట్టి వెట్టిచాకిరి చేయించుకుంటుందని జిల్లా సిఐటియు నాయకురాలు సుభాషిని తెలిపారు. సోమవారం విఒఎలకు కనీస వేతనాలు అమలు చేయాలని నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సారిక లలితా కుమారి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సిఐటియు నాయకురాలు ఎస్‌కె.సుభాషిని మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయకపోగా ప్రభుత్వం వాగ్దానం చేసిన రూ.10వేలు వేతనం కూడా అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ స్కీం వర్కర్స్ సంక్షేమ పథకాలు అమలు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.18వేలు ఇవ్వాలని అమలు చేయడం లేదని, అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం జరిగిన ఎన్నికలో అధ్యక్షులుగా సారిక లలిత కుమారి, కార్యదర్శిగా అలుమోలు కిరణ్‌మై, ఉపాధ్యక్షులుగా భలే భానుమతి, సహాయ కార్యదర్శిగా వగ్వాల అనిత, కోశాధికారిగా సిహెచ్ వెంకటలక్ష్మి, దేవుని విజయలక్ష్మి, చించినాడ వెంకటలక్ష్మి, కె.స్వరూప, రాధా, రాజ్యలక్ష్మి నూతన మండల కమిటీగా ఎన్నికయ్యారు. అనంతరం నిడమర్రు మండలం ఎపిఎం అధికారి టి.నాగేశ్వరావుకి వినతిని అందజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలని స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తిమ్మయ్యపాలెం నుంచి కైకరం జడ్‌పి ఉన్నత పాఠశాలకు సుమారు 7 కిమీ వరకూ 35 మంది విద్యార్థులు సైకిల్‌పై, మరికొందరు నడచి వెళుతున్నారని, ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచి సింహాద్రి శ్రీదేవి, గ్రామస్థులు సింహాద్రి సత్యనారాయణ సోమవారం ఏలూరులో కలెక్టరును కలిశారు. గ్రామస్థులు అధిక శాతం తిమ్మయ్యపాలెం నుంచి కైకరం నిత్యం రావాల్సి ఉందన్నారు. కైకరం జిల్లా పరిషత్ స్కూల్‌కు 35 మంది విద్యార్థులు నిత్యం వెళ్లిరావడానికి అవస్థలు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏలూరు డిపో నుంచి అక్కుపల్లిగోకవ రం వరకూ ఆర్‌టిసి బస్సు నడుస్తోందని, ఈ బస్సును అక్కుపల్లి గోకవరం-గోపరాజు పాడు మీదుగా తిమ్మయ్యపాలెం వరకూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్పంచి కోరారు. దీనిపై కలెక్టర్ ఆర్‌టిసి అధికారులకు ధరఖాస్తు ఫార్వర్డ్ చేయడంలో డిపో మేనేజరును కలిసి సమస్యను వివరించామని సర్పంచి శ్రీదేవి పేర్కొన్నారు. త్వరలో స్వయంగా వచ్చి రోడ్డు మార్గాన్ని పరిశీలించి, బస్సు సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారన్నారు.

రూ.26 లక్షలతో సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

గడప గడపకి మన ప్రభుత్వంలో భాగంగా చేబ్రోలులో పర్యటించినప్పుడు ప్రజల కోరిక మేరకు సిమెంట్ రోడ్లు నిర్మించామని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం చేబ్రోలులో గడప గడపకి మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు నుంచి రూ.6 లక్షలు మొత్తం రూ.26 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను సోమవారం ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్ఎ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముత్తా బుజ్జీ, ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, మాజీ సర్పంచి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని మండల ప్రత్యేక అధికారి పివిఎస్ నాయుడు తెలిపారు. సోమవారం దర్భగూడెం పంచాయతీ పరిధిలో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో అర్హులై దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ధృవీకరణ పత్రాలను అందించడం జరుగుతుందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో మొత్తం 14,50 ఇల్లు ఉండగా 13,50 కు పైగా ఇళ్ల సర్వేను వాలంటీర్లు పూర్తి చేశారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి 650 ధృవీకరణ పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం సచివాలయం పరిధిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, ఎంపిపి కోర్స పోసమ్మ, సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసిలు సున్నం సురేష్, కంచర్ల సుధారాణి, ఉప సర్పంచి రాఘవరెడ్డి, తహశీల్దార్ సుందర్ సింగ్, మంగతాయారు, ఎమ్ఇఒ శ్రీనివాస్, ఎపిఒ జాన్ వెస్లీ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలులో ముగిసిన 'జగనన్న సురక్ష'

భీమడోలు: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు సోమవారంతో ముగిసాయి. దీనిలో భాగంగా చెట్టున్నపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి జల్లూరి వెంకట నరసమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ మొక్కలను నాటారు. జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా దరఖాస్తులు సమర్పించిన 598 మంది సమస్యలను స్థానిక గ్రామపంచాయతీ పరిష్కరించగా, లబ్ధిదారులకు ఎంఎల్ఎ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న, అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు గ్రామ పరిధిలోని తాగునీటి చెరువు చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని కోరారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని మల్లవరం ఆవాస ప్రాంతంలో గల ఎంపిపి ప్రాథమిక పాఠశాలను శిధిలమైన నేపథ్యంలో దానిని తొలగించి అధునాతన సౌకర్యాలతో కూడిన నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని కోరారు. ఆగడాల లంక, చెట్టున్నపాడు గ్రామస్తులు చిరకాలంగా తమ గ్రామాల మధ్య ఉన్న కొల్లేరు వాగుల సరిహద్దు సమస్య పరిష్కరించాలని తెలిజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని, ఎంపిపి కనుమాల రామయ్య, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయ రాజు, ఎంపిడిఒ, ఎంఆర్‌ఒతో పాటు పంచాయతీ విస్తరణ అధికారి ముత్తయ్య గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: సుంకుల్లు గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ బ్యాక వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో చంద్రబాబుకు ఓటేస్తే గోదావరిలో వేసినట్టేనని ఎంఎల్ఎ అన్నారు. ఈ సందర్భంగా పలువురికి ధృవపత్రాలు అందజేశారు.

పోలవరం: ఇటికలకోట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఐటిడిఎ పిఒ జివి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం బాలరాజు, ఏలూరు జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ బి.సుమతి, జడ్‌పిటిసి కలుమ్ హేమ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమాలు ఎన్నో ప్రజల వద్దకు అందుబాటులో వచ్చాయని వీటిని ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. ఇటికల కోట పంచాయతీ ప్రజలకు తాగునీరు సరఫరా కోసం రూ.16.5 లక్షల నిధులతో వాటర్ ట్యాంక్ మంజూరైందని ఎంఎల్ఎ తెలియజేశారు. పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు

ముదినేపల్లి: ప్రజలకు మరింత చేరువలో ప్రభుత్వ సేవలను అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వడాలి గ్రామ సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ సేవలను నేరుగా పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు ఈకార్యక్రమం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గంటా సంధ్య, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, మండల పార్టీ కన్వీనర్ ఎం.ఏసుబాబు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలోని గుర్వాయిపాలెంలో రూ.20 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులు, రూ.12.50 లక్షల ఇతర నిధులతో పూర్తిచేసిన సిసి రోడ్లను కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అర్హులైన దరఖాస్తుదారులకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, సర్పంచి బత్తిన ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి గోదావరి సత్యన్నారాయణ, ఉపసర్పంచి నల్లూరి మహాలక్ష్మీ, పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల: పి.కన్నాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు. వైసిపి యువనేత బొండాడ వెంకన్నబాబు, సర్పంచిలు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, సొసైటీ ఛైర్మన్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మండల ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

మద్ది ఆలయ హుండీ ఆదాయం రూ .43,50,782

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపులో మొత్తం ఆదాయం రూ.43,50,782లు సమకూరిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. సోమవారం జిల్లా దేవాదాయ శాఖ అధికారి సిహెచ్ రంగారావు పర్యవేక్షణలో 62 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు కీసరి సరిత విజయభాస్కర్ రెడ్డి, కరూర్ వైశ్యా బ్యాంక్ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు దండు వెంకట కృష్ణంరాజు, కర్పూరం రవి, జెట్టి దుర్గమ్మ, పాములపర్తి యువరాణి పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం: ప్రతి రైతు సార్వా 2023 ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తహశీల్దార్ స్లీవజోజి తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి, మండలం ఉద్యాన అధికారుల సమక్షంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, విఆర్ఒలకు ఈ పంట నమోదుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్లీవజోజీ మాట్లాడుతూ సార్వా 2023 సీజన్లో ప్రతిరైతు తాను పండించే పంటకు తప్పనిసరిగా ఈపంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ పోసా రావు మాట్లాడుతూ ప్రతి రైతు తమ పరిధిలో గల రైతు భరోసా కేంద్రంకి వెళ్లి ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించినారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, విఆర్ఒలు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్‌అదాలత్‌లో 11 కేసులు పరిష్కారం

నూజివీడు రూరల్: పట్టణంలోని జిల్లా జడ్జి కోర్టులో సోమవారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 11 కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మోటార్ ప్రమాదాల కేసులు, భూ సేకరణ వివాదాల కేసులను పరిష్కరించారు. నష్టపరిహారం కింద రూ.7 లక్షలు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జడ్జిలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఒకే రోజు నలుగురిని కరిచిన వీధి కుక్క

నూజివీడు రూరల్: పట్టణంలో సోమవారం వీధి కుక్క నలుగురిని కరిచింది. అప్సర సినిమా హాల్ సమీపంలోని రామాలయం వద్ద బిఫార్మసీ కాలేజీ ప్రాంతంలో సంచరించే ఈ కుక్క నలుగురుని కరిసింది. కుక్క కాటుకు గురైన వారు నూజివీడు ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. పట్టణంలో వీధి కుక్కల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

'విద్యపై దృష్టి కేంద్రీకరించాలి'

మండవల్లి: విద్యార్థులు క్రమశిక్షణను, ఏకాగ్రతను అలవర్చుకుని విద్యపై దృష్టిని కేంద్రీకరించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం నాగార్జున రావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మోటివేషన్ ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తప్పనిసరిగా క్రమశిక్షణ, ఏకాగ్రత అలవాటు చేసుకోవాలని, విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

మెట్టగూడెం ప్రజలు ఆందోళన

నూజివీడు రూరల్: సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం మెట్టగూడెం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఎవి ఆగ్రో ఫార్మ్ పేరిట గోవధ, పశువులను వధించడంతో వచ్చే వ్యర్థాలతో అనారోగ్యాలు ఏర్పడుతున్నాయని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రనకు స్పందన కార్యక్రమంలో వినతిని అందించారు. కంపెనీని తక్షణమే మూసివేయని డిమాండ్ చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ముసునూరు ఎస్ఐ యం.కుటంబరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ భారీ వర్షాలతో వరదలు వచ్చి వాగులు, వంకలు, ఏరులై పొంగి పోరిలే ప్రమాదంలో ఎవరూ చిక్కుకోరాదని, ముఖ్యంగా మండలంలోని తమ్మిలేరు పరిసర ప్రాంతాల్లో వున్న బలివే, ఎల్లాపురం, గుళ్లపూడి, వలసపల్లి, లోపూడి గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.